రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## హరితహారం మొక్కలను పరిశీలించిన ఎంపిడివో



హరితహారం మొక్కలను పెంచుతున్న ఫాంహౌజ్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

**నందిగామ డిసెంబర్17,ప్రభాతవార్త :** నందిగామ మండలంలోని మొత్కులగూడ, ఈదుల పల్లి, మొదళ్ళగూడ, బుగ్గోనిగూడ, బండోనిగూడ, నర్సప్పగూడ,వెంకమ్మ గూడ, అప్పరెడ్డి గూడ,మామిడిపల్లి గ్రామంలో శనివారం ఎంపిడివో బాల్ రెడ్డి హరితహారం మొక్కలను పరిశీలించారు.గ్రామపంచాయతీలో 30 రకాల మొక్కల కోసం విత్తనాలను చల్లించారు. హరితహారం కార్యక్రమంలో భాగం గ్రామపంచాయతీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణ, పంచాయతీల కార్యదర్శుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# జీనమ్‌వ్యాలీలో పరిశోధన ప్రయోగశాల ప్రారంభం

**-కేంద్ర మంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవీయ**

**-ఐసిఎంఆర్‌లో నేషనల్ యానిమల్ రిసోర్స్‌ఫెసిలిటీ బయో మెడికల్ పరిశోధన సెంటర్‌ను ప్రారంభించిన వైనం**

**-పాల్గొన్న మంత్రి సిహెచ్ మల్లారెడ్డి**



శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని తుర్కపల్లి-కొల్తూర్ గ్రామాల మధ్యగల ఐసిఎంఆర్‌లో నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ బయో మెడికల్ పరిశోధన ప్రయోగశాల సెంటర్‌ను ప్రారంభించి పాల్గొన్న కేంద్ర ఆరోగ్య,కుటుంబసంక్షేమ,రసాయనాల, ఎరువులు శాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ,పాల్గొన్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, డైరక్టర్ జనరల్ రాజీవ్ బహ్లా, తదితరులు

**శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా ప్రతినిధి) డిసెంబరు 17, ప్రభాతవార్త**

జీనమ్‌వ్యాలీలో ఐసిఎంఆర్‌లో నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ బయో మెడికల్ పరిశోధన సెంటర్‌ను కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమం, రసాయనాలు,ఎరువుల శాఖ మంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవీయ ప్రారంభించారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని తుర్కపల్లి-కొల్తూర్ గ్రామాల మధ్య గల ఐసిఎంఆర్-నేషనల్ యానిమల్ రిసోర్సు ఫెసిలిటీ బయో మెడికల్ పరిశోధన కోసం కొత్త అత్యాధునిక జాతీయ జంతు వనరుల సదుపాయాన్ని ప్రారంభించటం జరిగింది. విచ్చేసిన కేంద్ర మంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవీయకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి స్వాగతం పలికారు. తుర్కపల్లి-కొల్తూర్ గ్రామాల మధ్య గల జీనమ్‌వ్యాలీ (హైదరాబాద్) బయోటెక్ హాబ్ లో ఉన్న ఈ కొత్త క్యాంపస్ సుమారు 100ఎకరాల్లో విస్తరించి 20భవనాలను కల్గి ఉంది. భారత దేశంలో ప్రాధమిక,అనువర్తిత,నియంత్రణ జంతు అధ్యయనాల కోసం ఇదీ ఒక స్టాప్ సెంటర్‌గా పనిచేయనుంది. ప్రధాన మంత్రి ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగ కొత్త క్యాంపస్ దేశంలోనే కొత్త మందులు, వ్యాక్సిన్‌లు, రోగ నిర్ధారణకు సంబంధించిన ముందస్తు పరీక్షల కోసం మౌళికసదుపాయాల సేవల లభ్యతను నిర్ధారించటంలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. ఎసిఐఎంఆర్-ఎన్ఎఆర్ఎఫ్‌బిఆర్ అనే ప్రయోగశాల జంతు శాస్త్రాల కోసం ఏర్పాటు చేసిన సంస్థ దేశంలోనే అతిపెద్ద అంకితమైన సంస్థ. జూనోటిక్, ఇతర వ్యాధుల కారణాలను, రోగ నిర్ధారణ, చికిత్సలను అభివృద్ధి చేయటానికి, మానవ,జంతువుల బాధలను తగ్గించటానికి ఉపయోగపడనుంది. ఐసిఎంఆర్-ఎన్ఎఆర్ఎఫ్ బిఆర్ ప్రయోగశాల జంతువుల నైతిక సంరక్షణ, ఉపయోగం, సంక్షేమాన్ని ప్రోత్సహించటానికి ఉత్తమ సమకాలీన పద్దతులను అందించటానికి కూడ ప్రయత్నిస్తుందని సూచించారు. దీంతో పాటు ప్రయోగశాల జంతు శాస్త్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక రంగాలలో పరిశోధనలకు శిక్షణ ఇవ్వటం ఈ సంస్థ లక్ష్యంగ పేర్కొన్నారు. బయో ఫార్మా,బయోమెడిసిన్,బయోటెక్నాలజీలో అత్యుత్తమ కేంద్రాన్ని సృష్టించటం, నైతిక సంరక్షణ, జంతువుల వినియోగంపై అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించే దిశగా ముందుకు అడుగువేస్తుందని వివరించారు. బయోమెడికల్ పరిశోధన, శిక్షణకు మద్దతుగా నాణ్యమైన సేవలను అందించటం ద్వారా మానవీయ,నైతిక జంతు సంరక్షణ కోసం అత్యధిక అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉండటంతో పాటు వినియోగం, వనరుల సదుపాయం భారతదేశాన్ని 21వ దశలో కీలకమైన గ్లోబల్ ప్లేయర్‌గా మార్చగల సామర్థ్యాన్ని కల్గి ఉంటుందన్నారు. శతాబ్దపు బయో మెడికల్ పరిశోధన అని కేంద్రమంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవీయ పేర్కొన్నారు. ఈ సంస్థ ప్రపంచ స్థాయిలో మౌళిక సదుపాయాన్ని, అన్ని ఎస్‌పిఎఫ్ నాణ్యమైన జీవవనరులను అందుబాటులో ఉంచటానికి ఒక స్టాఫ్ పరిష్కారాన్ని సృష్టిస్తుందన్నారు. తద్వార పరిశోధనను ముందుకు తీసుకవెళుతుందన్నారు.

దేశంలో బయోమెడికల్ పరిశోధనలో అభివృద్ధి సామర్థ్యం సూచిస్తుందని ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి, ఐసిఎం ఆర్ డైరక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ అన్నా రు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసోర్చ్ (ఐసిఎంఆర్) న్యూఢిల్లీ బయోమెడికల్ పరిశోధన సూత్రీకరణ, సమన్వయం, ప్రచారం కోసం భార తదేశంలోని అత్యున్నత సంస్థ. ఇదీ ప్రపంచం లోని పురాతన వైద్య పరిశోధన సంస్థలలో ఒక టి. ఐసిఎఆర్ పరిశోధన ప్రాధాన్యతలు జాతీయ ఆరోగ్య ప్రాధాన్యతలకు అనుగుణంగ ఉంటాయి. వ్యాధి యొక్క మొత్తం భారాన్ని తగ్గించటానికి, జనాభా ఆరోగ్యం శ్రేయస్సును ప్రోత్సహించటా నికి ఐసిఎంఆర్ దేశంలోని ఇంట్రామ్యూరల్, ఎక్స్ ట్రామ్యూరల్ పరిశోధనల ద్వారా బయోమోడికల్ పరిశోధనలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ నూతన క్యాంపస్ సెంటర్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవీయతో పాటు రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, డాక్టర్ రాజీవ్ బహ్లా సెక్రటరీ డిపార్ మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్,డైరక్టర్ జనరల్ ఆఫ్ ఐసిఎంఆర్, శామీర్‌పేట ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్. మధుకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎండి జహంగీర్, నాయకులు జి.మల్లేశ్‌గౌడ్, వి.సుదర్శన్, డి.సాయిబాబు, వంగ వెంకట్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, కె.బిక్షపతి, కె.సత్యనారాయణ, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యాచారంలో కల్తీ మద్యం డంపుల కలకలం?

**-కల్తీ మద్యాన్ని మునుగోడు ఉప ఎన్నిక ప్రచారానికి తరలించినట్లు ఆరోపణ**

**-మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి సంబంధం ఉన్నట్లు జోరుగా ప్రచారం**

**-నకిలీ మద్యాన్ని గుర్తించడంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు విఫలం**

**-ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠా**

**-ఆందోళనకు గురవుతున్న మద్యం ప్రియులు**

**రంగారెడ్డి జిల్లా డిసెంబర్ 17 ప్రభాతవార్త**

కల్తీ మద్యం డంపులతో చుట్టుపక్కల ప్రాంతాలకు కల్తీ సీసాలను గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్న విషయం మండలంలో కలకలం రేపుతుంది. మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ఎక్సైజ్‌శాఖ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గతంలో మాల్ కేంద్రంలో కల్తీ మద్యం పట్టుబడి వైన్స్ షాపులను సీజ్ చేసిన సంఘటన తెలిసిందే. మళ్లీ అదే తరహాలో కల్తీ మద్యం విక్రయాలు జోరందుకున్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై మండల ప్రజలు గుసగుసలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని రెండు వైన్ షాపులలో యజమానులకు సంబంధం ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. దాదాపు గత కొంత కాలంగా జరుగుతున్న కల్తీ మధ్యం విక్రయాలు కోట్ల రూపాయలు దండుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ కల్తీ మద్యం డంపులతో ఇటీవల జరిగిన మునుగోడు ఉప ఎన్నిక ప్రచారానికి తరలించినట్లు స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా కల్తీ మద్యం సరఫరా విషయంలో స్థానిక ప్రజల్లో గుసగుసలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్ని రోజులుగా కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నిద్రమత్తులో ఉన్నారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మద్యం ప్రియులు, స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారరు. కల్తీ మద్యం విక్రయం విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఏ మేరకు చేధిస్తారో వేచి చూడాల్సిందేనని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

## శ్రీవారి ఆలయంలో ధనుర్మాస పూజలు ప్రారంభం

**కొడంగల్,డిసెంబర్ 17ప్రభాతవార్త**

పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహలక్ష్మి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస పూజలు ప్రారంబించారు.తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుసంధానంగా నిత్య కైంకర్యాలతో దేదివ్యమానంగా వెలుగొందుతున్న శ్రీవారి ఆలయంలో టీటీడీ ఆలయంలో మాదిరిగానే నెలరోజుల పాటు ధనుర్మాస పూజలు కొనసాగుతాయి.అందులో భాగంగా శనివారం ఉదయం శ్రీవారికి విశేష అలంకరణలతో సుప్రభాత సేవ,తోమాల సేవ,అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఆలయ పండితులు ధరూరి శ్రీనివాసాచార్యులచే తిరుపావై పారాయణను భక్తులకు వినిపించారు.ఈ సందర్బంగా ఆలయ పండితులు మాట్లాడుతు శ్రీనివాసుడికి వివాహం చేసుకునేందుకు గోదాదేవి చేయు వ్రతమునే ధనుర్మాసంలో పఠించే తిరుప్పావై పారాయణమని తెలిపారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.కాగా ధనుర్మాస పూజలకు కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు .కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు,భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో తిరుప్పావై పారాయణం వినిపిస్తున్న పండితులు శ్రీనివాసాచార్యులు

## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**-షీ టీంపై విద్యార్థులకు అవగాహన**



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

**కొడంగల్,డిసెంబర్ 17ప్రభాతవార్త**

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఇంచార్జ్ నర్సిములు అన్నారు.శనివారం కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళలపై జరుగతున్న నేరాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన షీ టీమ్స్ గురించి జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి ఐపీఎస్, డిఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిల ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.సైబర్ నేరాలు,మహిళలపై జరుగుతున్న నేరాలు,ఈవ్ టీజింగ్ బాల్య వివాహాలు,బాలకార్మిక నిర్మూలన తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు.100 డయల్‌కు షీ టీం నెంబర్ 181కు ఫోన్ చేయాలన్నారు.బాల్య వివాహాలను ప్రోత్సహించినా నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు.బాల్య వివాహలను అరికట్టడం,బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటి పోలీసింగ్,మానవ అక్రమ రవాణా,సీసీ కెమెరాల ఏర్పాటు, మద్యపాన నిషేదం,గంజాయి,గుట్కా,జూదం తదితర చెడు వ్యసనాలతో పాటు బ్యాంకింగ్ అన్‌లైన్ మోసాలు,డ్రగ్స్ నిషేదం,కరోనా బారిన పడకుండా తగు జాగ్రత్తలపై విద్యార్దులకు విపులంగా వివరించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజారాం,అద్యాపక బృంధం,విద్యార్దులు పాల్గొన్నారు.

## బిజెపి కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది

**- ఎమ్మెల్యేకు ఈడీ నోటీసులపై నేతల ఆగ్రహం**

**- తాండూరులో ప్రధాని మోడీ, బండి సంజయ్‌ల దిష్టిబొమ్మ దహనం**

**తాండూరు, డిసెంబరు 17, ప్రభాతవార్త :**

బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని బిఆర్ఎస్ నేతలు అన్నారు. తాండూరు ఎమ్మెల్యే ఫైలట్ రోహిత్‌రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేయడంపై బిఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తాండూరు పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో పట్టణ అధ్యక్షులు అప్పూ(నయ్యూం) ఆద్వర్యంలో బిఆర్ఎస్ నేతలు ధర్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్, అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోడి, బిజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, బండి సంజయ్‌ల దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎదిరించే దమ్ములేక బిజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని అన్నారు. టిఆర్ఎస్ నేతలే లక్ష్యంగా ఈడీ నోటీసులతో బయపెట్టాలని చూస్తుందని మండిపడ్డారు. ఎలాంటి సబందం లేని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో బిజేపీ కుట్రలను బట్టబయలు చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై కావాలనే కేంద్రం ఈడీ నోటీసులు ఇప్పించిందని ఆరోపించారు. ఈడీ నోటీసులకు బయపడేది లేదని అన్నారు. తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మంకాల్ రాఘవేందర్, నాయకులు హరిగౌడ్, ఇర్ఫాన్, చెన్‌బసప్ప తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు.

# మిషన్ భగీరథ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కారించాలి

**- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్**

**మిషన్ భగీరథ ఉద్యోగుల ధర్నాకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు**

**షాద్‌నగర్, డిసెంబర్ 17, (ప్రభాతవార్త) :**

రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ఉద్యోగస్తులను నిలువునా ముంచుతూ వారి శ్రమను దొచుకుంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామ శివారులోని మిషన్ భగీరథ 48 ఎంఎల్‌డీ నీటి శుద్ది కేంద్రం వద్ద మిషన్ భగీరథ ఉద్యోగులు చేస్తున్న ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్, ఆ పార్టీ నాయకులు పూర్తిగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... శ్రమకు దగ్గ జీతం ఇవ్వకుండా భగీరథ ఉద్యోగుల శ్రమను దోచుకొని కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. మిషన్ భగీరథలో పనిచేస్తున్న సిబ్బందికి 22 వేల జీతానికి బదులు 11 వేల రూపాయలు చెల్లిస్తున్నారని, సగం డబ్బులు కాంట్రాక్టర్ నొక్కేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డికి లాభం చేకూర్చే విధంగా మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించారని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులతో పాటు కాంట్రాక్టర్ కార్మికులను శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో కార్మికుల సంక్షేమం కోసమే అనేక చట్టాలను తీసుకోచ్చామని ఆయన ఈసందర్బంగా గుర్తు చేశారు. ఇకనైనా ప్రభుత్వం దిగి వచ్చిన మిషన్ భగీరథ ఉద్యోగులకు సరియైన న్యాయం చేయాలని వారి డిమాండ్లను వెంటనే నేరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు బాబర్‌ఖాన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘు, బ్లాక్ కాంగ్రెసన అధ్యక్షుడు బాలరాజుగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ ఖధీర్, సీనియర్ నాయకుడు పురుషోత్తంరెడ్డి, ఎల్లనమోని గిరి, సింగారం సుదర్శన్, బొమ్మ అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న వీర్లపల్లి శంకర్.

### సీఐటీయూ ఆధ్వర్యంలో...

గత రెండు రోజులుగా తమకు న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న మిషన్ భగీరథ ఉద్యోగులకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు ఆధ్వర్యంలో పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులకు సరియైన జీతాలు ఇవ్వకుండా ఆంధ్ర పెత్తందారులు విపరీతమైన దోపిడీ చేస్తున్నారని, కార్మికుల పొట్టగొట్టి వాళ్ల పబ్బం గడుపుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ మిషన్ భగీరథలో పనిచేస్తున్న పంపు ఆపరేటర్స్, లైన్మెన్, సూపర్‌వైజర్, గార్డెన్ వర్కర్స్, లైన్ ఆపరేటర్స్, స్లీపర్స్, ఎలక్ట్రిషన్, ల్యాబ్ టెక్నీషియన్‌లుగా సుమారు 183 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి కనీస సౌకర్యాలు, పనికి తగ్గ ఫలితం దక్కకుండా దోపిడీకి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇకనైనా వీరికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మహేష్, ఆంజనేయులు, శ్రీనివాస్, వినోద్, వివేక్, సురేష్, ఆంజనేయులు, గణేష్, మహేష్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భగీరథుడు సిఎం కెసిఆర్

**-నర్సప్పగూడ రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల 10లక్షలు మంజూరు**

**-అక్కమ్మ చెరువులో చేపపిల్లలు వదిలిన ఎమ్మెల్యే**

**నందిగామ డిసెంబర్17,ప్రభాతవార్త :**

అసంభవమని అనుకున్న తెలంగాణను సాధించి బంగారు తెలంగాణ దిశగా అభివృద్ధి చేస్తున్న సిఎం కెసిఆర్ కారణజన్ముడని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.శనివారం నందిగామ మండలం నర్సప్పగూడ అక్కమ్మ చెరువులో సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా 1లక్ష 30వేల చేపపిల్లలను వందశాతం రాయితీపై ఉచిత చేపపిల్లలను విడుదల చేశారు.సర్పంచ్ గొవిందు అశోక్ ఆధ్వర్యంలో పండగ వాతావారణంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు..అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పని చేస్తూన్నారని కితాభిచ్చారు. మత్స్యకార్మికులు ఆర్థికంగా ఎదగాలన్నదే ధ్యేయంగా పెట్టుకొని వందశాతం రాయితీపై ఉచితంగా చేపపిల్లలను అందిస్తున్నారని,మత్స్యకార్మిక కుటుంబాలందరూ చెరువులను సంరక్షించుకోని అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.

**బిటి రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల 10లక్షలు మంజూరు**

పాత జాతీయ రహదారి నుండి నర్సప్పగూడ వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల 10లక్షలు ఎఫ్‌డిఆర్ నిధులు మంజూరై య్యాయని ఎమ్మెల్యే తెలిపారు.త్వరలోనే నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.గోతులమయమైన నర్సప్పగూడ రహదారికి నిధులు మంజూరు చేసినందుకు నర్సప్పగూడ గ్రామస్థులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్,ఎంపిటిసి ఎంకిర్యాల కళమ్మ,చెగూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.విఠల్,మత్స్యకార్మికశాఖ ఎడి సుకీర్తి, నర్సప్పగూడ మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు కోడిచెర్ల యాద య్య, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య,మాజీ అధ్యక్షుడు నీరటి నర్సింహా,సంఘం సభ్యులు జెగ రాజు,రవిందర్,కుమార్,ఎంపిడిఓ బాల్ రెడ్డి,ఉప సర్పంచ్ కాట్న శేఖర్,నాయకులు జంగిలి కుమార్,యాదగిరి గౌడ్,కావలి నల్లయ్య,భూపాల్,సత్యనారాయణ,గోవిందు శేఖర్,మత్స్యకార్మిక సంఘం సభ్యులు,బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



నర్సప్పగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

# జనవరి 22న గట్టుమైసమ్మ జాతర నిర్వహణ

**-గుట్ట సమావేశంలో నిర్ణయం**



జాతర సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, ఆలయ చైర్మన్ చిత్తారియాదవ్, ఈఓ భాగ్యలక్ష్మి, ధర్మకర్తలు, నాయకులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్‌లో జనవరి 22న గట్టు మైసమ్మ జాతర నిర్వహించాలని నిర్ణయించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శ్రీగట్టుమైసమ్మగుట్ట దేవస్థానం ఆవరణలో శనివారం ఆలయ కమిటీ, ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, దేవస్థానం చైర్మన్ మామిండ్ల చిత్తారియాదవ్, ఈఓ ఎల్.భాగ్యలక్ష్మి తదితరులు హాజరుకాగా జాతర నిర్వహణపై చర్చించారు. ప్రతియేటా సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారం రోజున గట్టుమైసమ్మ జాతర నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. జాతర నిర్వహణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, పనివారల విధులు, భాధ్యతలు, పారిశుద్యం, నీటి సరఫరా తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈసమావేశంలో ఆలయ ధర్మకర్తలు కందకట్ల పద్మారెడ్డి, బొక్క జంగారెడ్డి, బర్ల సరోజ, ఎర్రోళ్ల మైసయ్య, కౌన్సిలర్లు బండారి అంజనేయులుగౌడ్, కడుపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, కులసంఘాల నాయకులు నారాయణ, బిక్షపతి, అంజయ్య, బర్ల హరిశంకర్, కెఎల్‌జి.ప్రసాద్, కె.నర్సింగ్‌రావు, పవన్, జగన్, రాజయ్య, నాగభూషణ ం, వెంకటేశ్, సునీల్, మధు, శ్రీనివాస్, ఓంప్రకాష్, రాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలని మంత్రి ఎర్రబెల్లికి వినతి



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి శ్రీరంగవరం గ్రామ సర్పంచ్ విజయనందరెడ్డి

**మేడ్చల్, డిసెంబర్ 17. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరి చేయాలని ఆ గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయనందరెడ్డి కోరుతూ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వినతి పత్రం అందజేశాడు. గ్రామ అభివృద్ధికి సుమారు రూ 2 కోట్ల నిధులు కేటాయించాలని కోరినట్లు ఆయన తెలిపాడు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

## మేడ్చల్‌లోని గ్రాండ్ విటా ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్

**-ఇద్దరి కార్మికులకు గాయాలు**

**-కంపెనీ నిరక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపణలు**

**మేడ్చల్, డిసెంబర్ 17. ప్రభాతవార్త :** మేడ్చల్ పారిశ్రామిక వాడలోని కెమికల్ కంపనీలో ప్రమాదవశాత్తు రియాక్టర్ పేలడంతో ఇద్దరి కార్మికులు గాయాలు పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పారిశ్రామిక వాడలోని గ్రాండ్ విటా ఫార్మా కంపనిలో శనివారం ఉదయం కార్మికులు పని చేస్తున్న సమయంలో ప్రమాదశాత్తు కంపనీలోని రియాక్టర్ పేలింది. ఈ ప్రమాదంలో కంపనీలో పని చేస్తున్న గోపాల్, వినోద్‌లకు గాయాలయ్యాయి. వారిని వెంటనే తోటి కార్మికులు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. కాగా కంపనీ నిర్లక్ష్యం వలనే రియాక్టర్ పేలిందని స్తానికులు ఆవేదనతో ఆరోపించారు. కంపనీలో పనిచేసే కార్మికులకు ఎలాంటి భద్రత పరికాలు లేవని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో పని చేయాల్సి వస్తున్నదనె ఆరోపనలు వెలువడ్డాయి. గాయాలతో ప్రాణాలు బయపడ్డాయి కాని ఇంకొంచెం తీవ్ర స్థాయిలో ప్రమాదం జరిగి ఉంటే ప్రాణాలు పోయేవని అంటున్నారు. కాగా కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



ప్రమాదం జరిగిన గ్రాండ్ విటా ఫార్మా కంపనీ

## కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్టోత్సవాలు



కొనసాగుతున్న పూజా కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి

**మేడ్చల్, డిసెంబర్ 17. ప్రభాతవార్త ః** మేడ్చల్‌లో బొడ్డురాయి పునఃప్రతిష్ఠోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడు రోజు శనివారం ఉదయం పుష్పాదివాసం, శయ్యాదివాసం, ఫలాదివాసం, తదితర పూజా కార్యక్రమాలు, హోమం కొనసాగాయి, వేద పండితులు చేపట్టిన పూజలతో నగరమంతా వేదమంత్రాలతో మారు మ్రోగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బాల సభ ద్వార విద్యార్థుల్లోని నైపుణ్యం తెలుస్తుంది

### - ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి



. బాలసభలో మాట్లాడుతున్న జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

**షాద్‌నగర్, డిసెంబర్ 17, (ప్రభాతవార్త) :** సర్కారు బడులలో చదివే పేద విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇలాంటి బాల సభలు చక్కటి వేదికలుగా నిలుస్తాయని ఫరూఖ్‌నగర్ మండల జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరిగిన బాల సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్కారు బడులకు వచ్చేవారంతా పేద విద్యార్థులేనని వారు పాఠ్యపుస్తకాల్లోని అంశాలపై పాటు సామాజిక స్పృహ, సమకాలీన అంశాలపై పట్టు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన అన్నారు. అదేవిధంగా కొందరి విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, కొందరిలో సేవా భావాలు సహితం ఉంటాయని ఆయన అన్నారు. విద్యార్థులు ఏయే రంగాల్లో రాణిస్తున్నారో గుర్తించి వారికి సరియైన సూచనలు, సలహాలు అందిస్తే వారు మరింత అభివృద్ధి చెందుతారని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## టిఫాస్కాన్ వైద్యులు లేక గర్భిణీలకు ఇబ్బందులు

### -డయాలసిస్ కేంద్రం ఏర్పాటుపై నిర్లక్ష్యం: ఎంపిపి



ఘట్‌కేసర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని మేడ్చల్ జిల్లా ఆసుపత్రిని శనివారం ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి సందర్శించారు. ఆసుపత్రిలో ఔట్‌పెషెంట్స్, పలు వార్డులను ఆయన పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఇటీవల ఆసుపత్రిలో మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా టిఫాస్కాన్ యంత్రం అందుబాటులోకి తెచ్చినప్పటికి గర్భిణీలను స్కాన్ చేసేందుకు కలెక్టర్, డిఎంహెచ్ఓలు వైద్యులను నియమించలేదని పేర్కొన్నారు. దీంతో గర్భిణీలు బయట ప్రైవేటు సెంటర్లలో మూడువేయిల రుపాయల వరకు ఖర్చు చేసుకొని స్కానింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి కొనసాగుతుందని పేర్కొన్నారు. కిడ్నీ రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ఇక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావును కలిసి వినతిపత్రం అందజేసినప్పటికి ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పేద రోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఇకనైనా అధికారులు ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఎంపిపి సుదర్శన్‌రెడ్డి కోరారు.

## ఎన్ఎస్ఎస్‌తో సేవాభావం..ప్రాధాన్యం: వీసీ




ఏయూలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ రామచంద్రం

**ఘట్‌కేసర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్-2, 3 ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం వాలీంటర్లకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్. రామచంద్రం హజరై వాలీంటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థి దశలో సేవా భావాన్ని అలవరచుకోవడానికి ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎన్ఎస్ఎస్ ద్వారా ప్రజలను చైతన్యం చేసే అవగాహన, శిభిరంలో సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహించడంతో అధికారులు ధృవపత్రాలు జారీ చేస్తారని వీటికి ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత ఇస్తారని వీసీ పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం శిక్షకుడు రవితేజ, ఏయూ అడ్మిషన్స్ డైరక్టర్ డాక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావులు కూడా ప్రసంగించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త చెన్నకేశ్ మల్లేశ, యూనిట్-2 ప్రొగ్రామ్ అధికారి ఎస్‌కె.నయబ్‌రసూల్, యూనిట్-3 పీఓ ఎం.మధుకర్, మురళీకృష్ణ, వాలీంటర్లు తులసీ, జాన్నష్వర్, ఆయేషా, సుమయ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదారతను చాటుకున్న మున్సిపల్ కౌన్సిలర్

**కొడంగల్,డిసెంబర్ 17ప్రభాతవార్త**

దివ్యాంగుడికి ఉచితంగా దుస్తులను అందిస్తు ఉదారతను చాటుకున్నాడు మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్.వివరాల్లోకి వెళితే..కొడంగల్ పట్టణానికి చెందిన దివ్యాంగ యువకుడు అన్వర్ గతకొంత కాలంగా మాటలు రావు.దివ్యాంగుడి కుటుంబ పరిస్టితి దీనస్దితిలో ఉండడంతో ఆ యువకుడిపై మానవతా దృక్పదంతో కొత్తబట్టలు అందించాడు.ఈ సందర్భంగా పర్సాపూర్ వార్డు సభ్యులు గొల్ల మోహన్,అభిజిత్ తదితరులున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు

## బిఆర్ఎస్ ముస్లిం మైనార్టీలకు ఒరగబెట్టిందేమి లేదు

### పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు ముస్లిం మైనార్టీలకు ఒరగబెట్టిందేమి లేదని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం అయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పిన సిఎం కెసిఆర్ పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. మైనార్టీలకు రుణాల పేరుతో ప్రభుత్వం మరో మోసానికి తెరలేపిందన్నారు. డిసెంబర్ 16 ను ంచి రుణాల కోసం దరఖాస్తు చేసుకుందామంటే సంబంధిత వెబ్ సైట్ తెచుకోకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిద్దిపేటకు చెందిన మైనార్టీ నాయకులు గొప్పలు చెప్పడమే తప్ప చేసింది శూన్యమన్నారు. గతంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇప్పటీ వరకు ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు అన్యాయమే జరుగుతుంది తప్ప ఒరిగిందేమిలేదన్నారు. దేశ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని సిఎం కెసిఆర్‌ను నమ్మె పరిస్థితుల్లో లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ముస్లిం మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడానికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలువాలన్నారు. సమావేశంలో ఫయాజ్, గయాసుద్దీన్, హసుద్దీన్, నదీమ, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణోత్సవానికి పటిష్టమైన బందోబస్తు : సిపి



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్వేత

**కొమురవెల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ ఎన్.శ్వేత అన్నారు. శనివారం మల్లన్న కళ్యాణం జరిగే తోట బావి,పరిసరా ప్రాంతాలు, వీఐపి పార్కింగ్, జనరల్ పార్కింగ్, దర్శన ప్రదేశాలను అమె పరిశీలించి అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ కళ్యాణోత్సవం సందర్భంగా పటిష్ట బందోబస్తును 4 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వామి వారి అవరణలో 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 280 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. అమె వెంట పోలీసు అధికారులు సందెపోగు మహేందర్, శ్రీనివాస్, చంద్రమోహన్, బాలాజీ, అలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల విషయంలో రాజకీయం తగదు

### ఎమ్మెల్యే రఘునందన్‌రావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**మిరుదొడ్డి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో రాజకీయం తగదని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించతలపెట్టిన ప్రాథమిక వైద్య ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేశారు. అలాగే వంటగది, టాయిలెట్స్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే స్వంత నిధులతో ఏర్పాటు చేసిన హై మాస్క్ లైట్లను సర్పంచ్ మల్లన్నగారి శాంతమ్మతో కలిసి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తుందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో అరోగ్య ఉప కేంద్ర భవనాల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి హరీష్‌రావు వివక్ష చూపుతున్నారని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అడ్డుతగలకుండా సహకరించాలన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న మురికి కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.అంతకు ముందు లింగుపల్లిలోని ఎల్లమ్మ దేవాలయంలో అయన ప్రత్యేక పూజలు చేసి సొంత డబ్బులతో అలయ అవరణలో చేపడుతున్న వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. అయా కార్యక్రమాల్లో బిజెపి నాయకులు దేవరాజు, మల్లన్నగారి బిక్షపతి, పరుశరాములు, రమేష్‌గౌడ్, నవీన్‌రావు, కడారి యాదగిరి, చింత సంతోష్ తదితరులు ఉన్నారు.

## మందులు పంపిణీ



మందులను పంపిణీ చేస్తున్న డిసిసిబి డైరెక్టర్ వెంకటయ్య

**మిరుదొడ్డి, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** భూంపల్లి గ్రామంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మధుమేహం, బీపీ ఎన్‌సిడి కిట్‌ను డిసిసిబి డైరెక్టర్ బక్కి వెంకటయ్య అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉన్నతమైన జీవనానికి అరోగ్యకరమైన అలవాట్లను అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఉమారాణి బాల్‌గౌడ్, ఎఎన్ఎం మంజుల, అశ కార్యకర్తలు లక్ష్మీ, రమణ, కల్పన, మంజులతో పాటు గ్రామ యువకులు అతికం లింగం, కుర్మా లోకేష్, దోమకొండ నరేష్, ఉడిది సన్నిత్ తదితరులు ఉన్నారు.

## మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం మెదక్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**మెదక్ అర్బన్, డిసెంబర్17 ప్రభాతవార్త:** తెలంగాణ మున్నూరు కాపు సర్నలిస్టుల ఫోరం మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని టీఎంకేజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. టీఎంకేజేఎఫ్ జిల్లా కన్వీనర్‌గా తిమ్మన్నగారి శ్రీధర్, పి. ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు సీహెచ్. రాహుల్, గడ్డం ప్రశాంత్, కోశాధికారిగా ఎస్. నవీన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ. సుధాకర్, వి. శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్. నాగభూషణం, వి. రాజు, ప్రచార కార్యదర్శిగా ఎన్. శేఖర్, కార్యవర్గ సభ్యులుగా ఎ. భాస్కర్, ఎ. సత్యనారాయణ, ఈ మల్లేష్, గౌరవ సలహాదారులుగా ఎ. వెంకన్నబాబు, కామాటి కృష్ణ, సుందం రాజశేఖర్, మెదక్ అసెంబ్లీ కన్వీనర్‌గా ఎ. శేఖర్, నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్‌గా జి. మహేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్త లక్ష్మణ్ మాట్లడుతూ మున్నూరు కాపు జర్నలిస్టుల ఐక్యత లక్ష్యంగా తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్, కో కన్వీనర్లు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొత్త దేవయ్య పటేల్, ఉపాధ్యక్షులు బట్ట జగపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేమె యాదగిరి, హన్మంతరావు లక్ష్మణ్‌లు అభినందించారు.



రక్తదానం చేస్తున్న విగ్రం శ్రీనివాస్‌గౌడ్

## రక్తదానం ప్రాణాలను కాపాడుతుంది : ఎఫ్‌సీఐ డైరెక్టర్

**పెద్దశంకరంపేట, డిసెంబర్17 ప్రభాతవార్త:** రక్తదానం మహా దానమని కేంద్ర ఫుడ్ కార్పోరేషన్ డైరెక్టర్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు కార్యకర్తలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించి స్వయంగా ఆయన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విగ్రం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఒక వ్యక్తి పది మంది ప్రాణాలను కాపాడే అద్భుత అవకాశం రక్తదానం వల్ల లభిస్తుందన్నారు. అనంతరం అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు లక్ష్మీ రమేష్, కృష్ణమూర్తి, సర్వేశ్వర్, గంగాధర్‌గౌడ్, సతీష్‌గౌడ్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



జిల్లా ఖజానాధికారికి వినతి పత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్17 ప్రభాతవార్త:** ఆగస్టు నుండి పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా ఖజానాధికారికి వినతి పత్రం సమర్పించారు. ఎస్‌టీవో పరిధిలో ఏ బిల్లులు పెండింగ్‌లో లేవని జిల్లా ఖజానాధికారి తెలిపారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు కూడా విడతల వారిగా ఇస్తూ, అవి కూడా 5-6 నెలలుగా చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేసి పెండింగ్ డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల వివాహాలకు అండగా సంతోష గంగాధర్



పుస్తె మెట్టెలను అందజేస్తున్న బండారి సంతోష గంగాధర్

**శివ్వంపేట, డిసెంబర్17 ప్రభాతవార్త:** నిరుపేల ఆడపిల్లల వివాహాలకు ఆసరా నిలుస్తుండటమే కాకుండా తనవంతుగా ఉచితంగా పుస్తె మెట్టెలు అందజేస్తున్న సేవా రత్న అవార్డు గ్రహీత, టీఆర్ఎస్ పార్టీ మండల కోశాధికారి బండారి సంతోష గంగాధర్ ఉదార స్వభావమిది. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన బండారి గంగాధర్ దంపతులు ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేయడమే కాకుండా దైవ కార్యక్రమాలకు తన వంతుగా విరాళాలు అందిస్తుండటం పట్ల గంగాధర్ దంపతులను పలువురు అభినందిస్తున్నారు. జిల్లాలోని ఏ గ్రామంలోనైనా పేద ఆడిబిడ్డల వివాహానికి అవసరం ఉన్నట్లు తెలిసిన వెంటనే అప్పటికప్పుడు పుస్తె మెట్టెలు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు లక్షలాది రూపాయలు వచ్చిస్తూ పుస్తె మెట్టెలు చేయించి బహుమానంగా ఇస్తున్నట్లు తెలుస్తుంది.

## ఆర్థిక సహాయం అందజేసిన చిన్ననాటి మిత్రులు

**శివ్వంపేట, డిసెంబర్17 ప్రభాతవార్త:** చిన్ననాడే కాదు.. ఉన్నన్నినాళ్లు ఒకరి బాధలను మరొకరం పంచుకొని సాధకబాధకాలలో అందరం పాలుపంచుకుందామని, ఆదపలో ఉన్న స్నేహితులందరికీ బాసటగా ఉంటూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల ఉన్నత పాఠశాల 2002-03 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పిల్లుట్ల గ్రామానికి చెందిన జోగు మహేష్ తన పేదరికం కారణంగా చిన్న అమ్మమ్మ ఊరైన చేగుంట మండలం పెద్దశివనూర్ గ్రామానికి బ్రుతుకు దెరువుకై వెళ్లి అక్కడ అనారోగ్యానికి గురై తనపై ఆధారపడ్డ కుటుంబానికి పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తనతో టెన్త్ క్లాస్ చదువుకున్న తోటి విద్యార్థులకు వాట్సాప్ గ్రూప్‌లో మొర పెట్టుకోగా వెంటనే స్పందించిన టెన్త్ క్లాస్ బ్యాచ్ విద్యార్థులు పెద్దశివనూర్ గ్రామానికి చెందిన జోగు మహేష్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. జోగు మహేష్ కుటుంబానికి ప్రభుత్వం నుండి డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు మెగావత్ రవి, ముత్యాలు, శ్రీనివాస్, మధు, పాండరిగౌడ్, కరుణాకర్‌రెడ్డి, ప్రభుదాస్, కృష్ణవేణి, నర్సింలు, నాగేందర్, హనుమంతు, మల్లేష్, శ్రీనివాస్, కుమార్, నరేందర్, సరిత, హేమలత, శ్రీనివాస్, రజిత, నర్సింలు, శేఖర్‌రెడ్డి, ప్రవీణ్, సందీప్, మహేష్, రాజు, శ్రీనివాస్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, డిసెంబర్17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్ వద్ద వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప మాల ధరించిన భక్తులు మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి పద్దెనిమిది మెట్లను ఏర్పాటు చేసి మెట్టుమెట్టుకు పండ్లు, పూలు, కుంకుమ, దీపాలతో అలంకరించారు. అనంతరం పరిసర ప్రాంత అయ్యప్ప మాలాధారణ భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు కీర్తనలతో హోరెత్తించారు. అయ్యప్ప స్వామి స్మరణతో ఆ ప్రాంతమంతా మోరుమ్రోగింది. అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు కఠోర దీక్షతో చలిలో సైతం ఉంటూ పూజలు నిర్వహిస్తున్నారు. కఠోర దీక్షలో ఉన్న స్వాములు పూజల్లో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి స్వామి, మల్లేశం స్వామి, రవీందర్, రాజు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం

**వెల్దుర్తి, డిసెంబర్17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మంగళపర్తి గ్రామంలో శనివారం అదే గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం, లక్ష్మిల కూతురు వివాహం జరిగింది. ఈ వివాహానికి సర్పంచి రామకృష్ణారావు రూ.5,116 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ వివాహ వేడుకల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన చేతుల మీదుగా ఆర్‌కే కిట్‌ను అందజేశారు. కాగా సర్పంచి రామకృష్ణారావు ఇప్పటి వరకు 48 పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, శివ్వంపేట ఎంపీపీ హరికృష్ణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, భూమయ్య, రామచందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

### -టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మాణిక్‌రెడ్డి

### -పాఠశాలలను సందర్శించిన టిఎస్‌యుటిఎఫ్ ఉపాధ్యాయ నాయకులు



లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి.మాణిక్‌రెడ్డి,పాల్గొన్న తదితరులు

**శామీర్‌పేట, డిసెంబరు 17, ప్రభాతవార్త**

శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి.మాణిక్‌రెడ్డి పర్యటించి ఉపాధ్యాయులతో సమావేశమైయ్యారు. శనివారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఉద్దెమర్రి, కేశ్వాపూర్, మూడుచింతలపల్లి, కేశవరం గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పర్యటించారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. త్వరలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులను టిఎస్‌యుటిఎఫ్ నుంచి పోటీ చేయనున్న రాష్ట్ర నాయకులు పి.మాణిక్‌రెడ్డి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టిఎస్ యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులు సంపూర్ణ మద్దతు పలికారని అన్నారు. ఆయా పాఠశాలలను సందర్శించిన వారిలో ఆయనతో పాటు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్, శామీర్‌పేట మండల అధ్యక్షులు పి.తిరుమలేశ్, ప్రధాన కార్యదర్శి యు.కుమార్, టిఎస్‌యుటిఎఫ్ నాయకులు తిరుమలప్రసాద్, పురుషోత్తం, జిల్లా కార్యదర్శి కుమారస్వామి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో యువతి ఆత్మహత్య

**కొడంగల్,డిసెంబర్ 17ప్రభాతవార్త**

మనస్థాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.సంఘనటకు సంబంధించి ఎస్సై రవిగౌడ్ కథనం మేరకు..గ్రామానికి చెందిన కావలి శిరీష(17) అను అమ్మాయి మనస్దాపంతో శనివారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని మృతి చెందింది.సంఘటనపై మృతురాలి తల్లి కావలి మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎసైస్ తెలిపారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**కొడంగల్,డిసెంబర్ 17ప్రభాతవార్త**

కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కార్గిల్ కాలనీలో విద్యుత్ ప్రమాదానికి గురైన వ్యక్తి మృతిచెందాడు.ఏఎస్సై బాల్‌కిషన్ కథనం మేరకు.. కార్గిల్ కాలనీకి చెందిన షమీమ్(30) ఈనెల 8న తన ఇంటికి రంగులు వేస్తున్న సమయంలో ఇంటిపై నుంచి వెళ్ళిన 33కేవీ విద్యుత్ తీగలు తాకి ప్రమాదానికి గురైయ్యాడు.తీవ్ర గాయాలైన అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతు శనివారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు.మృతిడికి భార్య ఖదీరబేగం,ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## పిఎం కిసాన్ లబ్దిదారులందరూ ఈకైవైసీ చేయించుకోవాలి

**రామాయంపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త ః** పిఎం కిసాన్ లబ్దిదారులందరూ తప్పకుండా ఈకైవైసీ చేయించుకోవాలని రామాయంపేట మండల వ్యవసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ సూచించారు. మండల వ్యాప్తంగా పిఎం కిసాన్ లబ్దిదారులు 6851 కిగాను ఇప్పటివరకు 5621 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవడం జరిగిందన్నారు. ఇంకా మండల వ్యాప్తంగా 1200 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదని తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు 13వ విడత పిఎం కిసాన్ నిధులు అందే అవకాశం లేదని, చాలామంది రైతులు 11వ విడత, 12వ విడత డబ్బులు పడ్డాయి కాబట్టి ఈకేవైసీ తప్పనిసరి కాదని రైతులు అపోహపడుతున్నారన్నారు. 11, మరియు 12వ విడత పిఎం కిసాన్ నిధులు పొంది వ్యవసాయ విస్తీర్ణఅధికారుల వద్ద ఈకేవైసీ చేయించుకోని రైతుల జాబితాలో పేరు ఉన్నట్టయితే తప్పనిసరిగా మీసేవా లేదా కామన్ సర్వీస్ సెంటర్ లేదా పోస్టఆఫీస్‌లో ఈకేఈఐసీ చేయించుకోవాల్సి ఉంటుం దన్నారు. అదే విధంగా అతి సులభంగా తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లోనే రెండు నుంచి మూడు నిమిషాల వ్యవధిలో ఈకేవైసీని అప్డేట్ చేసుకునే అవకాశం ఉంది కావున రైతులు వెంటనే చేయిం చుకోవాల్సిందిగా తెలిపారు. మరిన్నీ వివరాలకు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారిని లేదా మండల వ్యవసాయ కార్యాల యంలో సంప్రదించాలని ఆయన తెలపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్యాలయంలో మీసేవా ప్రతినిధితో కలిసి రైతులకు వేలిముద్రల ద్వారా ఈకేవైసీ అప్డేట్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాజు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగంలో నియమించేందుకు నావిస్ ఒప్పందం

**నాగారం డిసెంబర్17,ప్రభాతవార్త :** బెంగళూరులోని మానవ వనరుల అభివృద్ధి మరియు ప్లేస్‌మెంట్ కంపెనీ అయిన నావిస్ హ్యూమన్ రిసొర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (సీఈఓ టకాకో ఒషిబుచి)తో ఐ.రాణి కుముదిని, ఐఏఎస్,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి,సీఈఓ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవన్ కార్పొరేషన్ (టిఓఎంసిఓఎం) సమక్షంలో భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేశారు.డిసెంబర్ నుంచి ప్రారంభమయ్యే తెలంగాణ-నావిస్ జపాన్ ఫస్ట్ బ్యాచ్‌కు తెలంగాణ నుంచి సిద్ధమైన 166మంది నర్సులు గాంధీ మెడికల్ కాలేజీలో అదేరోజు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇకపై నావిస్‌గా వ్యవహరించనున్న మానవ వనరుల అభివృద్ధి మరియు శిక్షణ సంస్థ నావిస్ హ్యూమన్ రిసొర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ( సీఈఓ టకాకో ఒషిబుచి) తెలంగాణ ప్రభుత్వ సంస్థ,ఇకపై టామ్‌కామ్‌గా వ్యవహరించనున్న తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కార్పొరేషన్ ( సీఈఓ విష్ణువర్ధన్ రెడ్డితో 15 డిసెంబర్‌న ఒక ఒప్పందంపై సంతకం చేసింది.అదే రోజున తెలంగాణ నుంచి దాదాపు 166 మంది నర్సులను నియమించుకునేందుకు పరీక్షించింది.

## సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

### బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం

**రామాయంపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త ః** సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు అయ్యాక చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ, కొమురం భీమ్ లాంటి మహానుభావుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదే విధంగా భారతదేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని కూడా అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చేనెల జనవరి మూడవ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొని అధికారికంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజా సంఘాలు, బీసీ సంఘాలు ఈ దిశగా అందరూ పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా సహకరించాలని ఆయన కోరారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట వేయాలి : చైర్మన్ చంద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రారెడ్డి

నాగారం డిసెంబర్17,ప్రభాతవార్త :
విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటవేసే బాధ్యత ఉపాధ్యాయులదే నని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. 10వ.తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

మొయినాబాద్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :
దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రములో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు మహిళ శిశు వికాసకేంద్రము జిల్లా మేనేజర్ సి. శైలకుమారి ఒ ప్రకటనలో తెలిపారు, మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ గ్రామ పరిధిలోని దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రము (ప్రాంగనములో) కంప్యూటర్ కోర్సుయందు ఉచ్చితంగా శిక్షణ పొందుటకు మహిళలు 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు, ఈ కోర్సుల కోరకు ఏవరైనా దరఖాస్తుచేసుకోవచ్చాన్నారు, కంప్యూటర్ కోర్సు శిక్షణ కాలము 4 నెలలు ఉంటుందన్నారు,రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం, చిల్కూర్ రెవెన్యూలో గల దుర్గాబాయి శిశువికాస కేంద్రం యందు ఆహలాదరకమైన వాతావరణములో ఈ శిక్షణ ఇవ్వబడుతుందన్నారు, ఈ శిక్షణ దరఖాస్తుచేసుకోవడానికి కనీస హర్హత ఇంటర్ మిడియేట్ పాస్అయి ఉండాలి, మహిళలు ఆధార్కార్డు, తెల్లరేషన్ కార్డు, ఇంటర్ పాస్ అయిన సర్టిఫికెట్, ఎస్.ఎస్.సీ సర్టిఫికెట్ యొక్క జిరాక్స్ కాఫీ, కుల ఆదాయ ద్రువీకరణ పత్రము మరియు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు (6) తో ప్రాంగణములో సంప్రదించాలని తెలిపారు, ఈ మహిళలు కంప్యూటర్స్లో ఉద్యోగం పొందుటకు మేము హాయ సహకారములు అందిస్తామని అన్నారు, మరినినవివరాల కోరకు సంప్రదాంచాల్సిన ఫోన్ నెంబర్లు, 7660022523, ఆఫీస్ పనివేళలు ఉదయం 10:30 గంటల నుండి, సాయంత్రం 5 గంటలలోపు ఫోన్చేయోచ్చన్నారు,

## నాణ్యత తప్పని సరి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేష్బాబు

జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 17,(ప్రభాతవార్త):
నర్సరీలలో పెంచబోయే మొక్కల పెంపకంలో ప్రభుత్వ సూచనల ప్రకారం నాణ్యత ప్రమానాలను తప్పని సరిగా పాటించాలని ఎంపీడీఓ మహేష్బాబు అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని వనంపల్లి గ్రామంలో ఆయన ఉపాధి హామీ నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మట్టి చల్లి పట్టె విధానాన్ని నిర్వహాకులకు సూచించారు. మట్టి సేవరించి ప్యాకెట్లకు నింపి ప్రతి రోజు నీరు అందించాలని అన్నారు. విత్తనాలు వచ్చిన తరువాత మట్టి ప్యాకెట్లలో విత్తేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులను జరగాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాములు, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ స్థలానికి కంచె ఏర్పాటు


పనులను పరిశీలిస్తున్న ఎంపిపి అనితవిజయ్, జడ్పిటిసి అనురాధపత్యానాయక్

ఆమనగల్లు, డిసెంబర్17, ప్రభాతవార్త:
ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా శనివారం స్థలానికి కంచె వేశారు. పనులను ఎంపిపి అనితవిజయ్, జడ్పిటిసి అనురాధపత్యానాయక్ పరిశీలించారు. బస్టాండ్ సమీపంలోని బస్టాండ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో ఖాళీగా ఉన్న స్థలం చుట్టూ కడీలు వేసి తీగలు చుట్టారు. మండల పరిషత్ తీర్మానం మేరకు కంచె వేసినట్లు వారు తెలిపారు. త్వరలోనే షాపింగ్ కాంప్లేక్స్ నిర్మిస్తామని ఎంపిపి అనితవిజయ్ అన్నారు. కాగా అంతకు ముందు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థలంలోని చెత్త చెదారాన్ని ఎత్తి వేశారు శుభ్రం పరిచారు. ఈక్రమంలో మండల పరిషత్ ఆధ్వర్యంలో హుటాహుటిన కంచె వేయడం కొసమెరుపు. కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు దోనాదుల కుమార్, విజయ్నాయక్, గన్యనాయక్, మల్లేష్నాయక్, రాజు, అధికారులు ఏఈ కృష్ణయ్య, రమేశ్ ఉన్నారు.

## డంపింగ్ యార్డును ఎత్తివేయండి

ఆమనగల్లు, డిసెంబర్17, ప్రభాతవార్త:
ఆమనగల్లు పట్టణ సమీపంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును ఎత్తివేయాలని బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ కన్వినర్ నేనావత్ పత్యానాయక్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డులోని వ్యర్థాలతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలను అనారోగ్యాలకు గురి చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక బిఆర్ఎస్ నాయకులు చుక్క నిరంజన్గౌడ్, రైతు సంఘం అధ్యక్షుడు రూపం వెంకట్రెడ్డి, ఎంగలి రఘులతో కలిసి పత్యనాయక్ డంపింగ్ యార్డును సందర్శించి సమీప ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పత్యనాయక్ మాట్లాడుతూ జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డుతో ప్రజలతోపాటు సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో దుర్వాసన, ఈగలు, దోమల దండయాత్రతో అనారోగ్యాలకు గురౌతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ డంపింగ్ యార్డును సుదూర ప్రాంతానికి తరలించాలని పత్యానాయక్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప్పల రాములు, గాజుల శ్రీను, ఎనుముల రమేశ్, వడ్డెమోని శివకుమార్, జంతుక కిరణ్, లండం యాదయ్య, జంతుక అల్లాజి, దేవేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లులోని డంపింగ్ యార్డుని పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# దళితులకు కెసిఆర్ ఇచ్చిన హామీ మూడెకరాల భూమి దేవుడెరుగు

**-అసైన్డ్ భూములను సెజ్ పేరుతో దళారులు దోచుకుని దాచుకుంటున్నారు**
**-టీఆర్ఎస్ నాయకులు అక్రమంగా భూములను దోచుకునేందుకే ధరణి పోర్టల్**
**-బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్రెడ్డి**


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కొత్తూర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :
దళితులకు కేసీఆర్ ఇస్తానన్న మూడెకరాల భూమి దేవుడెరుగు వారికి బ్రతకమని ఇచ్చిన అసైన్డ్ భూములను సెజ్ పేరుతో టీఆర్ఎస్ దళారులు గుంజుకుని దండుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు,షాద్నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ నెల్లి శ్రీవర్ధన్రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కొత్తూర్ మండలం సిద్దాపూర్లో ఏర్పాటు చేసిన బీజేపీ సమావేశంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న బీజేపీ నాయకులు నెల్లి శ్రీవర్ధన్రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్రెడ్డి, అమ్డాపురం నర్సింలు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక కేసీఆర్ సీఎం అయిన తర్వాత ఈ రాష్ట్రంలో భూములకు సంబంధించి అనేక అక్రమాలు అవినీతి జరిగిందని, మునుపెన్నడూ లేని విధంగా అవినీతి జరుగుతుందని మండిపడ్డారు. అక్రమంగా ఆక్రమణలు జరిపుకునేందుకే ఈ ధరణి పోర్టల్ వేదికైంది అని ఆరోపించారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చాకే రైతులకు అనేక సమస్యలు వచ్చాయని, దీని సాకుతో దళారులు పుట్టుకొచ్చారన్నారు. మునుపెన్నడూ ఈ విధంగా జరగలేదని కేసీఆర్ సీఎం అయిన తర్వాతే ఈ సమస్యలు పుట్టుకొచ్చాయని రైతుల దగ్గరున్న భూములను సెజ్ల పేరుతో పరోక్షంగా గుంజుకుంటున్నారని పేద ప్రజలకు బ్రతకమని ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం వివిధ రూపాల్లో తీసుకుని పెద్ద పెద్ద కంపెనీలకు అప్పజెప్తున్నారు. లాభపడుతున్నది టీఆర్ఎస్ నాయకులు మధ్యవర్తులు దళారులు మాత్రమే అని తెలిపారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటైన తర్వాత ఈ ధరణి పోర్టల్ తీసివేస్తామన్నారు. అన్ని గ్రామాల్లో బీజేపీ పార్టీని బలోపేతం చేసుకుంటూ షాద్నగర్ నియోజకవర్గంలో కాశయజెండా ఎగరవేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాణిక్యం, ప్రతాప్రెడ్డి, భాస్కరాచారి, హరికృష్ణ, వెంకటయ్య, మల్లేష్, కృష్ణగౌడ్, ప్రశాంత్, మోహన్, సత్యం, రాజు, భరత్, శేఖర్, శ్రీదర్చారి, కొండలాచారి, శివ, నరేష్, బీజేపీ నాయకులు ఉన్నారు.

# పాఠశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**-చిన్నతనంలోనే విద్యార్థులను మంచి మార్గంలో నడిపించాలి**
**-పాఠశాల చైర్మన్ రాజప్రవీణ్**



మొయినాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :
విద్యార్థులను చిన్నతనంలోనే మంచి మార్గంలో నడిపించాలని ప్రియదర్శిని పాఠశాల చైర్మెన్ మరియు ప్రిన్సిపాల్ రాజప్రవీణ్ అన్నారు. శనివారం మొయినాబాద్ మండలంలోని ఎన్కేపల్లి గ్రామ పరిధిలోని ప్రయదర్శిని పాఠశాలలో ఘణంగా క్రిస్మస్ మరియు అన్వ్యల్డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా సెంటినేరి మెథోడిస్ట్ నాంపల్లి చర్చ్ పాస్టర్ వైఎమ్. భాస్కర్ , జికె.సాల్మోన్, కోరని ప్రసాద్, హజరయ్యారు, పాఠశాల విద్యార్థులు నృత్యాలు, పాఠలతో అందరిని అల్లరించారు, ఈ సందర్భంగా ఎన్కేపల్లి మెథోడిస్ట్ చర్చ్ పాస్టర్ విమల్, బ్రదర్ జెమ్స్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు, ఈ సందర్భంగా పాస్టర్ విమల్ విద్యార్దులను ఉద్దేశించి వాక్యసందేశం చేస్తు చిన్నతనంలోనే విద్యార్దులు క్రీస్తు నీడలో పయణించాలని, దేవుని పట్ల భయం, భక్తి కలిగి, తల్లి దండ్రులను సన్మానించే విధంగా విద్యారంగంలో రాణించాలన్నారు, బాలుడు నడువ వలసిన త్రోవలో బాల్యంలోనే తల్లి, దండ్రులు నడిపించాలని, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్దవహించాలని సూచించారు, క్రీస్తు ఈ లోకానికి వచ్చి 2022 సంవత్సరాలు పూర్తి కావస్తుందని ఏసుక్రీస్తు చరిత్రను తెలియజేశారు, విద్యార్థులు క్రీస్మస్ డ్యాన్స్లు, స్కిట్లను క్రీస్తు జీవిత చరిత్ర కలిగిన డ్రామను ప్రదర్శించారు, ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ రాజప్రవీణ్ మాట్లాడుతూ ఈ పాఠశాలను మాతల్లి పేరుమీద సుగునా ప్రమాణిక్ పేరుమీద ఈ స్కూల్ను ఉచ్చితంగా నడిపిస్తున్నామని తెలిపారు, విద్యార్థులు మీరు కూడ చిన్నతనంలోనే మంచిగా క్రీస్తు మార్గంలోనే నడువాలని, మీ తల్లి,దండ్రులు మిమ్మల్ని చూసి గర్వపడేలా ఎదుగాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎన్ సాల్మోన్, చేవేళ్ల ప్రభుచరణ్, ప్రవీణ్, సన్నీ, జయరాజ్, జయాకర్, రాజేందర్, మరియు పాఠశాల ఉపద్యాయులు, సౌందర్య, సరీత తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభ్యున్నతికి సిఎం కెసిఆర్ కృషి


ముదిరాజ్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బండ ప్రకాష్

కొడంగల్,డిసెంబర్ 17ప్రభాతవార్త
రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ బండ ప్రకాష్ అన్నారు.శనివారం కొడంగల్కు విచ్చేసిన ఆయన మున్సిపల్ పరిధిలోని సిద్దనొంపు సమీపంలో ముదిరాజ్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కులవృత్తులను ప్రోత్సహిస్తు వారికి ఉపాధి కల్పిండంతో పాటు అన్ని రకాలుగా వారి అభివృద్దికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.అందులో భాగంగానే ప్రతి వర్గం వారికి భవనాలు నిర్మాణం చేసేందుకు స్థలాలు ఇవ్వడంతో పాటు నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు.ముదిరాజ్ భవన నిర్మాణ పనులను ప్రారంభించి కల సాకారం చేసేందుకు కృషి చేస్తానన్నారు.ఎమ్మెల్యే పట్నం నరేందర్రెడ్డి సహకారంతో పనులను త్వరలోనే ప్రారంబిస్తామన్నారు.కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అద్యక్షులు నర్సిములు,ఎంట్ల మల్లయ్య, బాల్రాజ్, టీ.పకీరప్ప, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తండావాసులు

కొడంగల్,డిసెంబర్ 17ప్రభాతవార్త :
మండల పరిధిలోని పోచమ్మ తండా,మైసమ్మ తండాలకు బీటీ రోడ్లు మంజూరీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్,ఎమ్మెల్యే పట్నం నరేందర్రెడ్డిల చిత్రపటాలకు సర్పంచ్ శంకర్నాయక్ అద్వర్యంలో ఆయా తండాలకు చెందిన గిరిజనులు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతు నియోజకవర్గంలో 32 కిలోమీటర్ల మేర రూ.52.7కోట్లతో బీటీ రోడ్లు మంజూరైయ్యాయని పేర్కొన్నారు.అందులో తమ తండాలకు బీటీ రోడ్లు కేటాయించినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఆయా తండాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయడం అభినందనీయం

శంకర్పల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :
శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలోని రిలయన్స్ బిల్డర్స్ వారు రిలయన్స్ కోర్ట్ యార్డ్ పేరుతో మొదటిసారిగా పట్టణంలో ఏడంతస్తుల మేడ(అపార్ట్మెంట్) నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రముఖ సంగీత దర్శకులు, నిర్మాత శశిప్రీతం, రిలయన్స్ బిల్డర్స్ అధినేత మునుసూరు శ్రీనివాస్, అఖిల బిల్డర్స్ యజమాని శ్రీనివాస్ తదితరులు ప్రాజెక్ట్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా శశి ప్రీతం మాట్లాడుతూ.... 35 సంవత్సరాలల్లో 42 ప్రాజెక్టులు రిలయన్స్ బిల్డర్స్ వారు పూర్తి చేయడం అభి నందనీయమన్నారు. 2004 సంవత్సరాల క్రితం తాను శంకర్పల్లికి వచ్చానని అప్పుడు ఇక్కడ ఇలాంటి భవన నిర్మాణాలు లేవన్నారు. రిలయన్స్ బిల్డర్స్ యజ మాని మునునూరి శ్రీనివాస్ మోకిల శివారులో రిలయన్స్ గ్రీన్ విలేజ్ ఏర్పాటు చేసి అందులో 135 విల్లాలు నిర్మించి మోకిలకే ఒక అందాన్ని తెచ్చారని కొని యాడారు. ఆ క్రమంలోనే శంకర్పల్లిలో 1.32 ఎకరాల్లో 131 అపార్ట్మెంట్లను నిర్మించడం సంతోషకరమన్నారు. రిలయన్స్ బిల్డర్స్ యాజమాని ముసునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.... ప్రస్తుతం శంకర్పల్లి పట్టణంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు లో అందరికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కాగా సంగారెడ్డి ఇస్నా పూర్లో 3.39 సర్వే నెం.340 అపార్ట్మెంట్స్ రిలయన్స్ సన్షైన్ పేరిట నిర్మించడం జరుగుతుందన్నారు. అంతకుముందు బేబి విజ్ఞాని ముసునూరు శ్రీనివాస్కు బొకె ఇచ్చి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో అఖిల బిల్డర్స్ యజమాని శ్రీనివాస్రావు, వినీత్ అగర్వాల్, తెలుగుల శ్రీనివాస్రావు, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.



రిలయన్స్ బిల్డర్స్ ప్రతినిధులు

## యాచారం గ్రామీణ బ్యాంకు పథకాలపై కళాకారుల బృందంచే అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్

యాచారం, డిసెంబర్ 17 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకు కల్పిస్తున్న పలు భీమా పథకాలపై శనివారం కళాకారుల బృందంచే ఖాతాదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కళ్యాణ్ మాట్లాడుతూ బ్యాంకు ఆధ్వర్యంలో పలు రకాల భీమా సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. రూ. 1020తో రూ. 22 లక్షల ప్రమాద భీమా, రూ. 436తో రూ. 2 లక్షల ప్రమాద భీమా సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. అదే విధంగా బ్యాంకు కల్పిస్తున్న ఇతర సేవలను గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీధర్రెడ్డి, శ్రీకాంత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



తలకొండపల్లి డిసెంబర్17,ప్రభాతవార్త :
తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిగని అంజమ్మ అనారోగ్యంతో మరణించడంతో ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తన ఉప్పల ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయంగా 3వేల రూపాయలను అదేవిధంగా ఎంపిపి రూ.2వేలు,మొత్తం 5వేల రూపాయలను బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మల్లేష్ వార్డు మెంబర్ శ్రీనివాస్,నాయకులు మాధవరెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,తిరుపతయ్య,కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

**సర్పంచ్ వరలక్ష్మీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో :** జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంజమ్మ మృతిచెందాడంతో సర్పంఛ్ వారి కుటుంబ సభ్యలను పరామర్శించి మనోధైర్యం చెప్పి భరోసా కల్పించారు. అనంతరం ఆర్థిక సహాయం 5వేల రూపాయలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రమౌళి చారి,పబ్బతి జంగయ్య,సెక్రటరీ, జానయ్య, మీసాల సాల్వయ్య,సిరిగని తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల పునరుద్ధరణకు దాతలు సహకారం అందించాలి : చైర్మన్


అన్నోజిగూడలోని పోచమ్మ దేవాలయం వద్ద బోరు బావి ఏర్పాటుకు పూజలు చేస్తున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి

ఘట్కేసర్ రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:
అన్నోజిగూడలోని దేవాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలోని పోచమ్మ గుడి వద్ద చైర్మన్ తన డబ్బులు వెచ్చించి బోరుబావి తవ్వించారు. బోరుబావి ఏర్పాటుకు శనివారం చైర్మన్ కొండల్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని పురాతన దేవాలయాల పునరుద్ధరణకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ. సురేశ్, కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, నాయకులు బి. సత్తిరెడ్డి, గాంధారి బాస్కర్, సగ్గు శివకుమార్, కేఎం. రెడ్డి, జితేందర్ నాయక్, కొంతం శంకర్ రెడ్డి, బాలగోని శంకర్ గౌడ్, బి. రాజేశ్వర్ రెడ్డి, గాంధారి అశోక్, సింగిరెడ్డి బిక్షపతి రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : చైర్మన్

**-సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేసిన కౌన్సిలర్, చైర్మన్**



నాగారం డిసెంబర్17,ప్రభాతవార్త :
మౌలిక సదుపాయాల రూపకల్పనకు కృషి చేస్తానని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని 5వ.వార్డు వెంకట్ రెడ్డి నగర్ కాలనీలో మున్సిపల్ నిధుల నుండి 10లక్షల రూపాయలతో సిసి రోడ్డు అభివృద్ధి పనులకు కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్తో చైర్మన్ చంద్రారెడ్డి కలిసి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మున్సిపల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్మన్ కోరారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్,రాంచందర్, ఆనందరావు, రమణరావు,శ్రీనివా స్, కృష్ణారావు,అశోక్ కుమార్,గోపాలకృష్ణ,తదితరులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## శివయ్యను దర్శించుకున్న అయ్యప్ప స్వాములు


దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న స్వాములు

నందిగామ డిసెంబర్17,ప్రభాతవార్త :
నందిగామ మండలం తాటిగడ్డ తండా పరిసర ప్రాంతాలు అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి.తండా సన్నిధానంలో నిత్యా ఆల్పాహారంతో పాటు పూజలు నిర్వహిస్తున్నారు.శనివారం తండాకు చెందిన అయ్యప్ప భక్తులు సోమశీల దర్శించుకొని శివయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.ఈ వేడుకలో స్వాములు వినోద్ నాయక్,గురుస్వామి,స్వాములు వినోద్ కుమార్,శ్రీరామ్, సంతోష్, భాను,రమేష్,తదితరు కన్యస్వాములు,పాల్గొన్నారు.

## హెచ్ఎంకు మెమో జారీ


పాఠశాల పరిసారాలు పరిశీలిస్తున్న ఎంఈఓ కిష్టారెడ్డి

జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 17,(ప్రభాతవార్త):
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్కు మెమో జారి చేసినట్లు మండల విద్యాధికారి కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. పాఠశాలలో సెలవు పట్ల శ్రీనివాస్ వ్యవహరించిన తీరుకు జిల్లా విద్యాధికారులు విచారణ జరిపి మెమో జారి చేసినట్లు ఆయన వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించి శుభ్రంగ ఉండే విదంగా చూసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

**PUBLIC NOTICE**

**I, Manne Anasuja, W/o. Manne Ashok,** Age: 39 years, R/o. H.No. 4-46, Tellapur Village, Ramchandrapuram Mandal, Ranga Reddy District do hereby state that I have entered into an Agreement of Sale in respect of land admeasuring Ac.1.36 gts with 15 feets Passage Road from Main road to Agriculture Land in Sy.No.6/A situated at Marepally Village, Peddemul Mandal, Vikarabad District from its lawful owner and possessor S.Prabhavathi, W/o. S.Mukund Reddy, Aged about 39 years, Occ: Agriculture, R/o. H.No.2-57, Mambapur Village, Peddemul Mandal, Vikarabad District and paid huge amounts towards sale consideration and registration of the said land is going to be held on or before 10/01/2022 and if any general public/legal heirs/ persons having any rights, interest, claims, objections, passage disputes & any other objections may put forth objections in written format through valid document proofs to my contact no.8186051966, 8019226986 so that I'll be aware of the same and cancel the registration if found any genuine objections/ claims, after registration claims/ objections are not entertained.
**MANNE ANASUJA**
**8186051966**
**8019226986**

**PUBLIC NOTICE**

It is hereby informed the all public that, my client namely **Ch. Chandra Babu S/o. Shankaraiah** R/o. Plot No.107, Hanuman Nagar, Saroornagar, Ranga Reddy District, T.S., entered into an Agreement of Sale on 05-12-2022 with K. Ravinder Reddy S/o. Mohan Reddy, R/o. Plot No.61, Hastinapuram, Ranga Reddy District, of House Plot No.58, an extent of 200 Sq.Yards, in Survey No.627/a, 627/E, 627/EE, 628/AA and 628/EE, situated at A.V. Nagar-III Extension in Turkayamjal Village, Abdullapurment Revenue Mandal, Ranga Reddy District, and bounded by: North:: Plot No. 59, South:: 57, East:: Plot No.71, West:: 30 Wide Road.
If any objections in the above said House Plot of any body, please contact me with in (7) days from the date of publication along with documentary evidence, if any body is not contacted within the above said period, my client shall not entertain the objections after seven days, and he will be proceed for further the steps.
**Sd/- J. RAJESWAR**
**Advocate**
H.No. 20-112/A, ROAD NO.4, SHARADA NAGAR, RANGA REDDY DISTRICT AT:: HYDERABAD, PIN: 500060
**CELL NO. 9346468920**

**PUBLIC NOTICE**

The General public is hereby informed that our client Shriram City Union Finance Limited Vanasthalipuram Branch, Hyderabad Dist is dealing with financing business in the course of business **Mr. SYED ADIL S/o Late SYED AOULIYA,** approached our client for finance and accepted to deposit his title deeds in respect of his property i.e. All that the Open Place (Dismantled H.No.1-03), admeasuring 300 Sq.yards or equivalent to 250.83 Sq.Mtrs, Situated at Khagazghat Village, under Agapally Gram Panchayath, Manchal Revenue Mandal, Ranga Reddy District, and Bounded as follows:- North: Internal Road, South: Road to Japal, East: House of Sudarshan Reddy, West: House of Siddique, towards security for the loan availed by him. If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our client will proceed with the transaction.
**Sd/- S. SRINIVAS RAO**
**A. SUPRIYA**
**Advocates**
H.No.2-19-79/A/10/A, Balaji Enclave Extn, East Kalyanpur, Uppal, Hyderabad-500 039.
Cell: **9948104019**

**PUBLIC NOTICE**

The General public is hereby informed that our client Shriram City Union Finance Limited Vanasthalipuram Branch, Hyderabad Dist is dealing with financing business in the course of business **Sri. Gyara Pochaiah, S/o G. Mallesh,** approached our client for finance and accepted to deposit his title deeds in respect of his property i.e. All that the piece and parcel of the Residential House No.5-20 old, 6-45 New, (West Part), admeasuring 263 Sq.yards or equivalent to 219.89 Sq.Mtrs, having it's A.C.C. plinth area 140 Sft, Situated at Manchal Village, Manchal Revenue Mandal, Ranga Reddy District, under Manchal Grampanchayath and Bounded as follows:- North: Road, South: Open Land of G. Babaiah, East: Open Place of G. Yadamma, West: House of A. Bhaskar, towards security for the loan availed by him. If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our client will proceed with the transaction.
**Sd/- S. SRINIVAS RAO**
**A. SUPRIYA**
**Advocates**
H.No.2-19-79/A/10/A, Balaji Enclave Extn, East Kalyanpur, Uppal, Hyderabad-500 039.
Cell: **9948104019**

